

# మారువేషం

**— దాశరథి —**

పసిడి గన్నేరుపూలు పందిట్లో పక్కన నవ్వాయి. పందిట్లో గన్నేర్లు వేసుకున్నావమ్మా అని అమ్మలక్కలంటే అమృతపాణికి ఎక్కడలేని కోపంవచ్చేంది. ఏం గన్నేర్లు వేసుకుంటే తప్పా! శివుడికి ప్రియమైన గన్నేరు పూలు తనకూ ఇష్టం. మొండిగా గన్నేర్లు వాకిట్లో పెంచింది అమృతపాణి. అమృతపాణి చేయి నిజంగా అమృతహస్తం. ఏమొక్క నాటినా ఇట్టే పాటుకుంటుంది. ఊర్లోవాళ్లంతా అమృతపాణిని పిలుచుకుపోయి తమ ఇళ్లల్లో పూలమొక్కలూ, కూరగాయల మొక్కలూ నాటించుకుంటారు. "నీవు నాటిన అరటిపిలకలు అరణ్యంలా వ్యాపించి విరగకాస్తున్నాయి అమృతం!" అంటూ సీతామహాలక్ష్మమ్మ ఒయ్యారంగా అన్నది. కాని అమృతపాణి గన్నేర్లు వాకిటో వేయడం ఆమెకూ నచ్చలేదు. "ఏమిటే అమృతం! ఎన్నెన్ని పూలమొక్కలు లేవు దేశంలో. మల్లెలు, మొల్లలు, రోజాలు, పారిజాతాలు— ఇవన్నీ వదిలి గన్నేర్లేమిటే గన్నేర్లూ!" అని సాగదీసుకుంది సీతామహాలక్ష్మమ్మ. సాధారణంగా అమృతపాణి ఎవరి ప్రశ్నలకూ జవాబు చెప్పదు. బుగ్గలు సొట్టలుపడేట్టు నవ్వి ఊరుకుంటుంది. పచ్చని గన్నేరుపూవు దగ్గరగా తనచేయి చాచి ఏది ఎక్కువ పచ్చగావుందో పరీక్షించుకుంటుంది. ఒక్కటే ఒక్కగన్నేరుపూవు కుడిచెవిమీదుగా జుత్తులో చెక్కుకుంటుంది. ఆ ఒంటిగన్నేరు అమృతపాణికి బంగారు నగలకంటె, రవ్వల ఆభరణాలకంటె ఎక్కువ శోభను చేకూరుస్తుంది. సీతామహాలక్ష్మమ్మ ఈసడింపు విని అమృతపాణి గన్నేరుకొమ్మ వంచి ఒకపూవు కోస్తూ ఇలా అంది:

"పిన్నిగారూ! పూలల్లో మంచివీ చెడ్డవీ ఉంటాయా! అన్నీ పూలే. పైగా నాకు నచ్చిన పూలు గన్నేర్లు. నేను వాటిని నాబిడ్డల్లా పెంచుకుంటాను. లోకానికి నాగన్నేర్లను చూచి కోపం దేనికి?"

ఎన్నడూ జవాబు ఇవ్వని అమృతపాణి తన ప్రశ్నకు ఎదురు ప్రశ్నలాంటి మాట అనే వరకు కోపం నషాళానికి ఎక్కింది సీతామహాలక్ష్మమ్మకు. గుడ్లురుముతూ అంది:

"అమృతం! ఇరవై ఏళ్లు దాటుతున్నాయి. ఎప్పుడో ఎక్కడికో వెళ్లిపోయిన చంద్రంగాడి కోసం ఈతపస్సు చేసిందానికంటే ఆ గన్నేర్లు జిల్లేళ్లు వదిలేసి చక్కగా పెళ్లాడరాదూ ఎవరినన్నా?"

ఆమాటకు నిజానికి అమృతపాణి మండిపడవలసింది. కాని చిరునవ్వుతో అమృతపాణి ఇలా అంది:

"వస్తున్నది సంక్రాంతి పండగ. ఈపండుగతో మూడేళ్లు నిండుతాయి అతను వెళ్లిపోయి.



ఈ ఎండుగకుకూడా అతను రాకుంటే ఏదో మార్గం చూసుకుంటాను పిన్నిగారూ! కోప్పడకండి.''

''మామ్మగదవే! అలా దారికిరా! ఒక ఇంటి దానివి కావాలని నాకోరిక. మీనాన్న పెద్దవాడైనాడు. ఎవరు చెప్పినా వినవు. పోలీసులకు కనపడకుండా తప్పించుకు తిరిగే దొంగలాంటి చంద్రంగాడికోసం నిరీక్షణ ఏమిటమ్మా!''

''పిన్నిగారూ! ఎవరు దొంగో, ఎవరు దొరో అందరికీ తెలుసు.చంద్రం దొంగెందుకవుతాడు? దేశంకోసం పోరాడేవాళ్లను పోలీసులు అరెస్టు చేస్తే వాళ్లు దొంగ అవుతారా? అయినా ఆయన ఏందొంగతనం చేశారు? నాకర్మకాలి ఆయన రాజకీయాల్లో చేరాడు. నాకు పెళ్లీడు వచ్చే సరికి ఆయన పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరగాల్సివచ్చింది. ఏనాటికైనా ఆయనే రావాలి నేనే పెళ్లిచేసుకోవాలి. అంతే''—ఈ మాటలతో అమృతపాణి గుండె దుఃఖంతో పొంగిపోయింది. కళ్లల్లోనుంచి గుత్తులుగుత్తులుగా ముత్యాలు రాలాయి. ఆమాటలు తండ్రి విని పరుగెత్తుకు వచ్చాడు.

''ఏమే! ఊర్లో ఎవరైనా పెద్దమనుషులు వచ్చి హితబోధచేస్తే వాళ్లమీదికి అలా దూకుతావేమే? వాళ్లు నీమేలుకోరేకదా చెబుతున్నది. అరణ్యంలో తపస్సు చేసుకునేవాళ్లలాగా జుట్టు విరబోసుకుని ఎంతకాలం ఇలా వుంటావు. ఈ సంక్రాంతితో నీగడువు ముగుస్తుంది. బలవంతంగానైనాసరే నిన్ను ఎవడికో ఒకడికి ముడిపెడతా, ఇక తప్పదు''—అన్నాడు తండ్రి జానకిరామయ్య.

సంక్రాంతి .... సంక్రాంతి వస్తోంది. తాన పెట్టిన ఆరేళ్లగడువు తీరుతుంది. మూడేళ్ల నాడు సరిగా సంక్రాంతిరోజున పోలీసులు వెతుక్కుంటూరాగా చంద్రాన్ని గన్నేరుకొమ్మల చాటునుంచి తెలివిగా తప్పించింది. ఆ నాటికీ ఈ నాటికీ చంద్రం మళ్లీ కనపడలేదు. ప్రతిక్షణం అతను ఆగన్నేరుకొమ్మలవెనకనుంచి వస్తున్నట్టే అనిపిస్తుంది. కాని అతను ఎన్నడూ కనపడలేదు.

చందమామ గన్నేరుకొమ్మల వెనుకగా తొంగి చూస్తే, చంద్రం వస్తున్నట్లనిపించేది, అమృతపాణికి. కాని కాస్త సేపట్లో చందమామ తనకు అందకుండా ఆకాశంలోకి ఎక్కిపోయేవాడు. అందని చందమామలాగే చంద్రంకూడా తనకు అందకుండా వెళ్లిపోయాడు. మళ్లీ ఒక్కనాటికీ కనపడడా! చంద్రం ఇక కనపడడనిపించేసరికి అమృతపాణిగుండెలో కొండలు కూలేవి. కాని ఆకాశంలోనుంచి చంద్రమామలా మళ్లీ తొంగి చూసేది.

''ఈసంక్రాంతికి చంద్రం వస్తాడు. తప్పక వస్తాడు, నాన్నా! చంద్రం వస్తాడు. ఈసంక్రాంతితో నాజీవితంలోని నరకద్వారాలు మూతపడతాయి. ప్రణయ స్వర్గకవాటాలు విచ్చుకుంటాయి నాన్నా! నాచంద్రం ఆ గన్నేరు పొదల్లోనించి పడివస్తాడు నాన్నా!'' అంటూ పెద్దగా ఏడ్చింది అమృతపాణి. ఆకాశంలోని మబ్బుల్లా గాలికి అల్లకల్లోలమైన తన కురులను సర్దుకుని కన్నీళ్లు తుడుచుకుంది.

సీతామహాలక్ష్మమ్మ దగ్గరగా వచ్చి కూతుని కళ్లు తుడిచింది కొంగుతో. ''నువ్వన్నట్టే వాడు వస్తే ఇంకేం కావాలమ్మా! నీ కష్టాలు గట్టెక్కుతాయి'' అంది సీతామహాలక్ష్మమ్మ. పసిడిగన్నేరు కన్నీరు కార్చినట్టు మంచుబొట్లు అమృతపాణి తలమీద రాలాయి. తనను ఆప్యాయంగా తల్లికంటే మిండుగా ప్రేమించే గన్నేరును చూడగానే అమృతపాణికి ఆశ పొంగివచ్చింది. ఒక్కమాటు ముఖంలో వెలుతురులు విరిశాయి.

"సంక్రమణం ఇంకా ఎన్నాళ్ళుంది పిన్నీ!" అని అడిగింది అమృతపాణి సీతామహాలక్ష్మమ్మను.

"ఎన్నాళ్ళా! పట్టుమని పదిరోజులు లేదు."

"అంతేనా! పదిరోజులే? పదిరోజుల్లోనే నా చంద్రం వస్తాడన్నమాట" అంది అమృతపాణి.

"నీ పిచ్చిగాని మూడేళ్ళనుంచి లేనివాడు ఇప్పుడొస్తాడా? నీపిచ్చి ఎన్నాళ్ళకు వదుల్తుందే?" అన్నాడు నాన్న.

"వస్తాడు నాన్నా! వస్తాడు. అతడు రానన్నా రావాలి. నేను పోనన్నా పోవాలి. అంతే. ఈ పండుగలో తేలి పోవలసిందే" అంది ధైర్యంగా అమృతపాణి.

"ఏం మాటలే అవి అభంశుభంతెలియకుండా, అని కోప్పడింది సీతామహాలక్ష్మమ్మ. అమృతపాణి గబగబా ఇంట్లోకి వెళ్ళింది. నీలిరంగు ఉల్లిపొర చీరె మీద కప్పుకొని పంగపండు రవిక బుజాన వేసుకొని వచ్చింది.


"ఇవి ఆరేళ్ళనాడు మాచంద్రం తెచ్చినవి. ఇవి కట్టుకుంటా పండుగనాడు. ఇంకేవీ వద్దు నాకు" అంది అమృతపాణి. "పిచ్చి..పిచ్చంటే పిచ్చే. నీ కెవరుచెబుతారమ్మా! పొద్దుకూక వస్తున్నది. పోతానమ్మా! అంటూ లేచింది సీతా మహాలక్ష్మమ్మ.

"నాపెళ్ళికి వస్తావుకదూ! పిన్నీ!" అంది చిలిపిగా అమృతపాణి.

"రాకపూరుకుంటానా," అంటూ సుడిగాలిలా చుట్టుకుని వెళ్ళిపోయింది సీతామహాలక్ష్మమ్మ.

తెల్లవారితే సంక్రాంతి. ఈ సాయంత్రం గన్నేరు విరగబూసినట్టు కనపడింది. బంగారం కరగబోసినట్లు పొంగిపోతున్న గన్నేరు నీడన పార్వతిలా కూచుంది అమృతపాణి! ఆకాశంలో ఒక్కటొక్కటే చుక్కలు చేరుకుంటున్నాయి. చలిచలిగా వుంది. గన్నేరుపువ్వు చేతులో పట్టుకుని గతకాలాన్ని నెమరువేస్తున్నది అమృతపాణి.

వద్దంటే వినకుండా ప్రభుత్వంతో తగాదా పెట్టుకున్నాడు చంద్రం. తనను విడిచిపోవలసి వస్తుందని తెలిసి ఎందుకు చేరాడు రాజకీయాల్లోకి? తనకంటె రాజకీయాలు ఎక్కువ ప్రియమా? మరితాను ఎన్నాళ్ళుఎదురుచూడాలి? స్వాతంత్ర్యం అసలు వస్తుందా? వచ్చినా ఎన్నడొస్తుందో? అంతలో—చంద్రాన్ని ప్రభుత్వం వారు ఎంతగా హింసిస్తారో? చంద్రాన్ని పట్టుకుంటె? పట్టుకుంటే తనకు దక్కడు. మరి తప్పించుకు తిరుగుతేమాత్రం తనకు దక్కుతాడా? గాంధీమహాత్ముడు ఎందరెందరు ప్రేయసీప్రియులను విడగొట్ట ఉద్యమం లేవదీశాడు? ఛా! తప్పు. మహాత్ముడు లోకకల్యాణం కోసం పాటుపడుతున్న మునీశ్వరుడు. అలనాడు బుద్ధభగవానుడు తన తమ్ముడైన నందుణ్ణి సుందరినుండి వేరుచేస్తే సుందరి తిట్టిపోయిలా! అలాగే తానూ మహాత్ముణ్ణి తిట్టడం



రచయిత

తప్పుకాదూ! దేశంకోసం కష్టపడే వ్యక్తుల్ని ప్రేమించాలిగాని ద్వేషించరాదు. పోనీ పోతున్నవాడు తననూ తీసుకుపోతే. తనవల్ల అతని పనికి ఆటంకమేమో?

పరిపరివిధాల ఆలోచించుకుంది అమృతపాణి. ఆరాత్రి తిండి సహించలేదు. తండ్రి ఎంత బ్రతిమాలినా ఒక్క మెతుకైనా తినలేకపోయింది. రాత్రంతా ఏవో భయంకరమైన కలలు. పక్కలో గన్నేరుపూలు పరచుకుని పడుకుంది అమృతపాణి. తెల్లవారడం త్వరగా జరిగితే బావుండునని ఆరాటం, తెల్లవారితే ఏం ప్రమాదమో, మరికొంత సేపు రాత్రేవుంటే బావుండునని కోరికా—ఇలా పరిపరివిధాల వలపోస్తుకుంది అమృతపాణి.

తెల్లవారింది. ముక్కుమీదినుంచి నడినెత్తిలోకి ఎగతట్టేలా ఊర్ధ్వపుండ్రాలు ధరించి, గల్లుగల్లుమని కంచుగజ్జెలు బెంగణాలు తొక్కుతూ వుండగా, చిడతలు వాయిస్తూ జియ్యరువచ్చాడు. అతని చిడతలచప్పుడికి అమృతపాణిగుండె గులగుల అయిపోయింది. భయం భయంగా లేచి బయటికి తొంగిచూచింది.

తెల్లటియెద్దు, యెద్దుమీద నల్లటిగొంగడి, దానిమీద ఎర్రశాలువాలు, పట్టుకండువాలు కొమ్ములకు ఇత్తడి తొడుగులు. చేతిలో మునుతాడును పట్టుకుని ఎవరతను? తలకు చిరిగిపోయిన పాగా, ఒంటిమీద చిరిగిన కోటు, పెరిగిన గడ్డం, మీసాలు, వచ్చీరాక వాయిస్తున్నసన్నాయి—ఎవరతను? కొప్పులోని గన్నేరుపువ్వుమెడమీదనుంచి జారి గంగిరెద్దులవాని జోలెలో పడింది.

"బసవన్నా! అమ్మవారికీ దండంపెట్టు
కాసులుపోయమని దోసిలిపట్టు
పట్టుబట్ట లిమ్మని పట్టుబట్టు బసవన్నా"

అని అరిచాడు గంగిరెద్దులవాడు. అతని గొంతులో ఆరేండ్లనాడు తనను రహస్యంగా పిలిచిన చంద్రం పలుకు వినిపించింది. క్షీణించిన శరీరం, రాగి బారిన వెంట్రుకలు , నల్లపడ్డ మొహం, భయం తొణికిసలాడే కళ్ళూ—అతను చంద్రమే. అమృతపాణిగుండె జల్లుమంది. గబగబా మెట్లు దిగి కిందికి ఉరికి వచ్చింది. చంద్రం కళ్ళలోకి తదేకదీక్షతో చూచింది. అతను అవునో కాదో? బూడిద క్రమ్మిన నిప్పుకణికల్లా వున్న అతని కళ్ళలో చంద్రం సాక్షాత్కరించాడు.

"చంద్రం"—అని పెద్దగా కేకవేసింది అమృతపాణి. చంద్రం కనుసైగ చేశాడు. ఆమె మారుమాటాడకుండా నిలబడింది. అతను దగ్గరగా వచ్చాడు. "పెద్దగా అరవకు. పోలీసులు కనిపెడతారు. నేను పట్టుపడితే మావ్యూహం భగ్నమవుతుంది. నీకు ధైర్యం చెప్పడానికిఃచ్చాను మనస్సు కుదుటపరచుకో"—అన్నాడు చంద్రం. అతని కళ్ళల్లో సముద్రాలు తొణికిసలాడాయి.

"చంద్రం! నువ్వు ఈపూట ఇక్కడే వుండు. ముందు ఏమిచేయాలో ఆలోచింతాం"—అంది దుఃఖంగా అమృతపాణి.

"వీల్లేదు. పోలీసులు వెన్నాడుతున్నారు. అనుమానించారంటే నావథకం దెబ్బతింటుంది. వెళ్లొస్తా. ధైర్యం చెడకు" అన్నాడు చంద్రం.

"అప్పుడే పోతావా చంద్రం! నేను నీకు అక్కరలేదా?"

"అలా అనకు. నీకోసం క్షణమొక యుగంగా గడుపుతున్నాను. నన్ను తెలుసుకో."

"పండుగ ఒక్కనాడైనా ఇంట్లో ఉండకుండా పోతావా?"

"ఎక్కడికీ పోను. ఈవూర్లోనే ఉంటాను. మళ్లీ కనపడతాను."

"వీల్లేదు. నీవు ఇవాళ ఎటూ వెళ్లడానికి వీల్లేదు."

"అలాఅనకు అమృతం! గొడవ అవుతుంది."

"కాఫీతెస్తా తాగుదుగాని."

"గంగిరెద్దులవాడికి కాఫీ పోస్తే అనుమానించరూ?"

"ఫరవాలేదు. ఆ గన్నేరు చెట్టు కిందికిరా."

"మరి గంగిరెద్దో?"


"ఎద్దును వదిలేయి. నీవు ఇలారా!"

"ఎలా రాను అమృతం?"

"ఇటు .... ఇటు"—అంటూ అమృతం చంద్రాన్ని గన్నేరుచెట్టునీడల్లోకి తీసుకువెళ్లి కూర్చోపెట్టింది. చంద్రానికి ఎటూ తోడలేదు.

"ఆ గంగిరెద్దులవానితో సొదేమిటే? ఒక పాతధోవతిఇచ్చి వెళ్ళగొట్టక"—అంటూ అమృతపాణి తండ్రి లోపలినుంచి అరిచాడు.

గన్నేరుచెట్లు వెనుకనుంచి దొడ్డిదారిని చంద్రాన్ని ఇంట్లోకి తీసుకువెళ్లింది అమృతపాణి. గంగిరెద్దు గన్నేరు కొమ్మలకింద పడుకుంది.



# రంగుల చక్రం

ఎం. వి. మోహనరావు

చంద్రం ఆరేళ్ళకు తలంటి పోసుకున్నాడు. వేడివేడి పరమాన్నం తిన్నాడు. నువ్వులతో చేసిన భక్ష్యం ఆరగించాడు. చంద్రం వచ్చింది అమృత పాణి తండ్రికి కూడా తెలియదు. మూడేళ్ల తరువాత అమృతపాణికి పండుగ! తల్లి లేని తనకు తానే అయింట్లో పెద్ద.

"ఇవాళ ఈవూరంతా ఇలా అలంకరించివుంది ఎందుకో చెప్పుచంద్రం?" అని అడిగింది అమృత పాణి.

"సంక్రాంతి గనుక" అన్నాడు చంద్రం

"కాదు."

"మరేమిటి?"

"ఇవాళ మన పెండ్లి"—అంది అమృతపాణి నవ్వు, ఏడుపూ కలగలసిన కంఠంతో.

"అదేమిటి అమృతం! అలా అంటావు?"

"అవును, ఇవాళ మనపెళ్లి. ఆరేండ్లకు కనపడ్డావు."

"సంక్రాంతినాడు ఎవరైనా పెళ్లిచేసుకుం టారా? పైగా నేను రహస్యజీవితం గడుపుతున్న వాణ్ణి. ఎవరికంటబడ్డా ఉరికంబం ఎక్కవలసిం సిందే."

"పెళ్లికి ఎవరికంటబడడం దేనికి? నాకంట పడితే చాలు" అంటూ నవ్వింది అమృతపాణి. గబగబా పచ్చగన్నేరుపూలతో రెండు పెద్దదండలు గుచ్చింది. తాను కొత్తచీరె కట్టుకుంది. చంద్రా నికి కొత్తబట్టలు కట్టబెట్టింది. అతన్ని తన ఇంట్లోని పూజామందిరంలోకి తీసుకువెళ్లింది. చంద్రం మెళ్లో గన్నేరుదండ వేసింది. చంద్రం కళ్లల్లో ఆశానిరాశలు అల్లుకుని కనిపించాయి. అమృతపాణి మెడలో గన్నేరు దండవేసి తన కన్నీళ్లముత్యాలతో ఆమెను అలంకరించాడు. నిశ్శబ్దంగా, ఎవ్వరూ లేకుండా, ఏ మంత్రతం త్రాలూ లేకుండా ఇరువురూ వివాహం చేసు కున్నారు. వెంకటేశ్వరులపటంమీద కుంకుమా పూలూ చల్లారు.

"చంద్రం!" అన్నది అమృతపాణి. దుఃఖం పొంగి వచ్చింది. అమాంతం వెళ్లి చంద్రాన్ని కౌగి లించుకుంది.

"నన్ను విడిచి ఎక్కడికీ వెళ్లకు చంద్రం. వెళ్లవుకదూ!" అని అడిగింది అమృతపాణి. చంద్రం జవాబు చెప్పకుండానే ఆమెను తనకు మరీ దగ్గరగా తీసుకున్నాడు. గన్నేరుచెట్లకింద గంగిరెద్దు గంటలు మోగించింది. రేడియోలో సన్నాయి మ్రోగింది. ఇరువురి హృదయాలూ మంత్రాలు పఠించాయి.

'మీనాన్నకైనా తెలియకుండా ఈవివాహం ఏమిటి అమృతం?" అని అడిగాడు చంద్రం.

"నీవు వచ్చిన విషయం ఆయనకు కూడా తెలియనీయవద్దన్నావుగా?"

"అవును. ఆయనకు తెలిస్తే నేను రహ స్యంగా రావడాన్ని ఇష్టపడకపోవచ్చు" అన్నాడు చంద్రం.

చంద్రానికి తానువండిన వంటకాలన్నీ వడ్డించి భోజనం పెట్టింది. చిరకాలంగా సంస్కారంలేక జడలుకట్టిపోయిన తలవెంట్రుకలకు అమృత పాణి రాసిన పరిమళతైలం తనముక్కుపుటాల లోకి సువాసనలు చిమ్ముతుంటే ఆరేండ్లనుంచీ లేని నిండునిద్రపోయాడు చంద్రం. మనస్సులో భయంభయంగావున్నా అలసటవల్లనిద్రపట్టింది. సాయంత్రందాకా అలాగే పడుకున్నాడు.

ప్రభుత్వం దృష్టిలో అపరాధి, ప్రజల దృష్టిలో నిరపరాధి అయిన చంద్రాన్ని దాచడాని కన్నట్టు చీకట్లు త్వరత్వరగా ఆకాశంలోనుంచి భూలోకంలోకి చొరబడ్డాయి. ఊరంత సంక్రాంతి వేడుకల మైకంలో వుంది. పోలీసులు తమ తమ ఇండ్లలో కుటుంబాలతో కాలం గడుపుతున్నారు.

జాతీయోద్యమంలో వామపక్ష సభ్యుడు చంద్రం. హింసించే ఆంగ్లప్రభుత్వాన్ని హింస తోనే పడగొట్టాలనే విశ్వాసం అతనిది. కనుకనే ప్రభుత్వానికి లొంగకుండా రహస్యంగా తిరు గుతూ కాలం గడుపుతున్నాడు. అతని విశ్వాసాన్ని ఎవ్వరూ మార్చలేరు. అమృతపాణి కూడా మార్చదలచుకోలేదు.

బాగా చీకటిపడగానే అమృతపాణి, చంద్రం దొడ్డిదారిని నదిఒడ్డుకు వెళ్లారు. చలి. చంద్రం బజాల వెచ్చదనంతో చలిని ఎదిరిస్తున్నది అమృతపాణి. చిన్ననాడు ఇద్దరూ నదిగట్టున ఆడుకునేవారు. పసితనంనాటి పసందులు ఇప్పుడు ఎక్కడినుంచి వస్తాయి! చిక్కులూ చికాకులూ లేకుండా హాయిగా పక్షులవలె, నక్ష త్రాలవలె కాలంవెళ్లబుచ్చినరోజులవి. తమ బాల్యం కళ్లకుకట్టినట్లు ఇద్దరూ నిట్టూ ర్చారు. చుక్కలు గుచ్చిన నీలి ఆకాశపు పందిరి క్రింద, బలబలా ప్రవహిస్తున్న వాగుపక్కగా

చలిలో, ఇసుకలో రెండుగంటలు కూర్చున్నారు. మూడేండ్ల ఒకరికోసం ఒకరు దాచుకున్న రహస్యాలు చెప్పి విరబోసుకున్నారు. ఆ ఒక్కరాత్రే వాళ్లకు స్వర్గం. తెల్లవారితే విడిపోతారు.

"ఏమైనాసరే, నీవు నన్ను విడిచిపోవద్దు. ఇవాళటినుంచీ మనం భార్యాభర్తలం" అంది అ[illegible]. చంద్రం మాట్లాడలేదు. ఇద్దరూ ఇంట[illegible] వచ్చారు. దారిలో తమను ఎవరో కని[illegible]ట్టు భయం వేసింది. గబగబా ఇంట[illegible]రు.

నిప్పుబుడ్డిలా పూలుపేల్చి చల్లారిపోతోంది రాత్రి. అమృతపాణి తన్మయత్వంలో ఒళ్లు మరచి పడుకుని వుంది. చంద్రానికి గుండెలో ఎవరో గ్రుద్దినట్లైంది. మెలకువ వచ్చింది. లేచాడు. సుమారు నాలుగుగంటల సమయం. చలిగాడ్పు విశ్రుతవిహారం చేస్తున్నది.

అమృతపాణివైపు జూచాడు చంద్రం. అమాయకమైన ఆముఖం చంద్రబింబంలా మెరుస్తున్నది. ఏమీ దాచకుండా తనహృదయం సమస్తం దోచిఇచ్చిన అమృతపాణిని వదిలేసి ఎలావెళ్లడం? కాని వెళ్లాలి. అటు లోకం పిలుస్తోంది. ఇటు తన మెత్తనిచేతితో అమృతపాణి పిలుస్తున్నట్టుంది. ఎటు వెళ్లడం? ఉదయం నిద్రలేచి తాను వెళ్లిపోయినది ఎరిగి ఎంత బాధపడుతుంది అమృతపాణి! నిద్రలోనైతం తీయని ఆ గన్నేరుదండ ఆమె మెడలో ఎంత బావుంది!

ఒక పావుగంటపాటు వెనకాముందూ ఆడాడు చంద్రం. మనస్సు గట్టిచేసుకున్నాడు. దేశం పిలుపు మనసులో రొదచేస్తున్నది. ఈ ఊపుతో తెల్లవాళ్లను వెళ్లగొట్టాలి. 1942 ఉద్యమం చిరస్థాయిగా దేశచరిత్రలో నిలిచిపోవాలి.

"రా నాయనా రా" అంటున్నది భారతవాణి.

"వెళ్లకు చంద్రం! వెళ్లకు" అంటున్నది అమృతపాణి.

బయట గంగిరెద్దు మెడలో గంటలు మ్రోగాయి. తూర్పు తెలతెలవారబోతున్నది. చంద్రం అమృతపాణి దగ్గరగావెళ్లి నిలుచున్నాడు. ఆమె బుగ్గల నున్నదనం, కురుల మెత్తదనం, ఆ అరచేతుల కోమలత్వం — హృదయంలోని అమృతం అతన్ని ముగ్ధుణ్ణిచేశాయి. తనమెడలోని గన్నేరుదండ షర్టుప్రక్కజేబులో కుక్కుకున్నాడు. బయులుదేరాడు. గబగబా దొడ్డిదారిని బయటపడ్డాడు. గంగిరెద్దు వెంట నడిచింది.

"తెల్లారనైనా లేదు. అప్పుడే మళ్లీ గంగిరెద్దులవాళ్లు" అంటూ అమృతపాణి తండ్రి నిద్రలో గొణుక్కున్నాడు.

• • • •

అమృతపాణికి నెలలు నిండాయి.

"నిజం చెబుతావా? లేదా?" అని అరిచాడు తండ్రి. "నిజం ఇంతే నాన్నా! చంద్రం సంక్రాంతికి వచ్చాడు. నీకు గూడా తెలియకుండా దాచాను. మేంఇద్దరం వెంకటేశ్వర్లసాక్షిగా వివాహం చేసుకున్నాం .... ఇది ముమ్మాటికీ నిజం" అని ఏడ్చింది అమృతపాణి. లోకమంతా గుసగుసలు పోయింది. తనమాటలు తండ్రిగానీ, లోకంగానీ నమ్మలేదు. అయితే ఈ విషయం తెలిసిన పోలీసువారుమాత్రం అనుమానించారు. ఇంటి చుట్టూ కాపలాపెట్టారు. కూతురు తనమెడకు ఉరిపోసిందనుకున్నాడు తండ్రి. ఏమిచేయాలో తోచలేదు. అమృతపాణి రమానర్సింగు హోంలో చేరింది.

సీతామహాలక్ష్మమ్మ ఒక్కతే అమృతపాణిని చూడడానికి వచ్చింది. అమృతపాణి మాటలు ఆమెకూడా నమ్మలేదు. అయినా ఆపాయంలో వున్న అమృతపాణిని ఆదుకుంది సీతామహాలక్ష్మమ్మ. తన దౌర్భాగ్యానికి ఇటు లోకాన్ని, అటు చంద్రాన్ని నిందించింది అమృతపాణి. ఆడపిల్ల కలిగింది. పిల్లనుచూచి మురిసిపోయింది అమృతపాణి. పిల్లాతల్లీ ఇంటికి వచ్చారు. అమృతపాణి తండ్రి అవమానంతో తనగది విడిచి బయటికి రావడంలేదు. శిశువును చూడనైనా లేదు. వూర్లోవాళ్ల తలోకమాటాఅంటుంటే తలనరికినట్టుంది. ఇంటికి ఎవరూ రావడంలేదు. ఎప్పుడైనా వస్తే సీతామహాలక్ష్మమ్మ ఒక్కతే. ఆమె కూడా ఆఉన్ననాలుగు గడియలూ నానామాటలూ అంటుంది.

"పోయిన సంవత్సరం సంక్రాంతికి పిల్ల ఎంత సంతోషంగా వుంది! పాపం మళ్లీసంక్రాంతి వస్తోంది, ఏమి లాభం!" అంది నిట్టూరుస్తూ సీతామహాలక్ష్మమ్మ. "అమాట ఎత్తకు సీతమ్మ వదినా" అన్నాడు అమృతపాణి తండ్రి.

"పట్టుమని పండుగ నాలుగు రోజుల్లేదు. ఆగదిలో అదీ, ఈగదిలో నీవూ ఏడుస్తూ కూచుంటే ఎలాగా!" అంది సీతామహాలక్ష్మమ్మ.

"ఫరవాలేదు. ఇలా చీకటిలో చావనీ" అని విసుగుకున్నాడు అమృతపాణి తండ్రి. పూజకు పూలుకోసుకుని ఇంటికివెళ్లిపోయింది సీతామహాలక్ష్మమ్మ.

రానే వచ్చింది సంక్రాంతి మళ్లీ.

రోడ్డుమీద పత్రికలమ్మేవాడు పెద్దగా అరుస్తూ వెళుతున్నాడు.

"రాజకీయ నేరస్తులమీద నుండి నిర్బంధాల తొలగింపు. ఆంధ్రప్రభ చదవండి .... తాజా వార్తలు."

గదిలో పిల్లకు పాలిస్తున్న అమృతపాణి,గబగబా మెట్లుదిగి కిందికి పరుగెత్తుకు వచ్చింది. పేపర్లవాణ్ణి పిలిచింది. గబగబా పేపరులాక్కుని చదివింది. జైలునుంచి విడుదలైన వారిలిస్టూ, రాజకీయోద్యమంలో పాల్గొంటున్న నేరస్థుల మీద అంక్షలు తొలగించిన వార్తకింద పేర్లూ గబగబా కళ్లతో చదివింది. "ఏ. చంద్రశేఖరరావు" అన్నపేరువద్ద ఆమె కళ్లు ఆగిపోయాయి. కాళ్లు తడబడ్డాయి.

పేపరు పుచ్చుకుని తండ్రిగదిలోకి పరిగెత్తింది అమృతపాణి.

"అణా ఇవ్వండమ్మా!" అని పిలిచాడు పేపర్ల వాడు.

"చంద్రంమీద నిషేధం తొలగిపోయింది నాన్నా! మీఅనుమానాలన్నీ పోతాయి" అంది అమృతపాణి.

"వాడు వచ్చేదాకా నాతో మాట్లాడకు." అని గద్దించాడు తండ్రి.

"ఒక అణా ఇవ్వు నాన్నా! పేపరుకొంటాను" అంది దీనంగా అమృతపాణి. జేబులోనుంచి ఒక అణా తీసి విసిరేశాడు తండ్రి. అణా పుచ్చుకుని బయటికివచ్చింది అమృతపాణి. మొఖాన్ని పేపర్లతో కప్పుకుని నిలుచున్నాడు పేపర్లవాడు.

"ఇదిగో అణా" అంది అమృతపాణి.

పేపర్లవాడు మాట్లాడలేదు. "అణా అక్కరలేదా?" అంది అమృతపాణి. అతను మాట్లాడలేదు. పైనుంచి పాపఏడ్పు వినిపించింది. "నేను పోతా పాప ఏడుస్తున్నది. నీఇష్టం" అంటూ అణా విసిరేసింది అతనిమీదికి. అతను తనమొఖం మీదినుంచి పేపర్లు తీసి చూశాడు. చంద్రం!

"చంద్రం" అని పిలిచింది అమృతపాణి. తలకు చుట్టుకున్న మఫ్లర్ విప్పుతూ—"ఆ ఏడుస్తున్న పాప ఎవరు?" అని అడిగాడు చంద్రం.

"మనపాప ...." అంది అమృతపాణి.

చంద్రంముఖం వివర్ణమైంది. అతనిముఖంలోని వైవర్ణ్యంచూచి అమృతపాణి భయపడిపోయింది. ఇద్దరూ మాట్లాడకుండా నిశ్శబ్దంగా అలాగే నిలబడ్డారు—మెట్లమీద ఆవిడ, మెట్లకింద అతనూ! అతను పక్కకు చూశాడు. గన్నేరుపువ్వు పక్కన నవ్వింది. ఆనవ్వులో గడచిన సంవత్సరపు సంక్రాంతి సినీమాలా సాక్షాత్కరించింది.

"ఓ! మనపాపా?" అని నవ్వాడు చంద్రం. క్రుంగిపోయిన అమృతపాణి ఒంగిపోయి తానూ నవ్వింది.

చంద్రం మెట్లు ఎక్కాడు. అమృతపాణి మెట్లు దిగుతోంది. మధ్యగా ఇద్దరూ కలుసుకున్నారు. ఎడమచెవికి పైగా కురులలో కులుకుతున్న గన్నేరుమొగ్గను పెదవులతో తాకాడు చంద్రం.

"ఏం పాప?" అని రహస్యంగా అడిగాడు చంద్రం.

"అమ్మాయి" అంది అమృతపాణి.

"అయితే మనస్వాతంత్ర్యోద్యమంలో విజయం లభించిందికనుక "విజయ" అని పేరుపెడదాం అన్నాడు చంద్రం.

"అలాగే .... అదిగో "విజయ" ఏడుస్తోంది" అంది అమృతపాణి. తండ్రి గబగబా గదిలోనుంచి వచ్చాడు. అతన్ని చూచి ఇద్దరూ విడిపోయారు. అమృతపాణి గబగబా మేడమీదికి వెళ్లింది. చంద్రం మామగారి పాదాలు తాకాడు.

పైనుంచి "విజయ" ఏడుపు వినవడింది.

"విజయ ఏడుస్తోంది. వెళ్లి చూచొస్తా మామగారూ!" అన్నాడు చంద్రం.

''విజయ ఎవరూ?'' అని అడిగాడు ఆశ్చ ర్యంగా అమృతపాణి తండ్రి.

''మాకూతురూ, మీమనుమరాలూ. స్వాతం త్ర్యోద్యమంలో విజయం సాధించాం. కనుక దానికి విజయ అని నామకరణం చేశాం'' అన్నాడు చంద్రం.

''నామకరణం ఎప్పుడు జరిగింది?'' అని అడిగాడు అమృతపాణి తండ్రి.

''ఇప్పుడే, ఈమెట్లమీదే'' అన్నాడు చంద్రం.

''అన్నీ క్షణాల్లో జరుపుకుంటున్నారే'' అని తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు అమృతపాణితండ్రి.

''అవును, మీకూతురు క్షణంలో పెండ్లి జరిపించింది'' అన్నాడు నవ్వుతూ చంద్రం.

సీతామహాలక్ష్మమ్మ వచ్చింది. ఈమాటలన్నీ విని అందీ! ''ఏమర్రా! మాకు చెప్పకుండానే పెళ్లి చేసుకున్నారూ! పిల్లనీ కన్నారూ, నామ కరణం కూడా చేశారూ!''

''అవును అత్తగారూ! కొన్ని రహస్యంగా జరిగేవి వుంటాయి, కొన్ని సదస్యంగా జరుగు తాయి'' అన్నాడు చంద్రం.

''ఏం రహస్యాలోగాని మాకుమాత్రం పంచ భక్ష్యపరమాన్నాలతో సుష్టుగా భోజనాలు పెట్టించు నాయనా,కూతురు బారసాలనాడు'' అంది సీతామహాలక్ష్మమ్మ. అమృతపాణి వచ్చింది.

''గత సంక్రాంతినాడు పెళ్లి, ఈసంక్రాం తికి బారసాల. బాగుందర్రా!'' అన్నాడు తండ్రి.

చంద్రం, అమృతపాణి మేడమీదికి వెళ్లారు.

''మీరు ఎప్పుడూ మారువేషాల్లో వస్తారే మండీ! నిరు డేమో గంగిరెద్దులవాడిలా వచ్చారు, ఈసంక్రాంతి కేమో పేపర్లమ్మేవాడిలాగా...''

''అవునవును. మనదేశం వేషం కూడా మార బోతున్నది'' అంటూ నవ్వాడు చంద్రం.



# వచ్చింది సంక్రాంతి

★

## ఓలేటి చిరంజీవి శర్మ

వచ్చింది సంక్రాంతి
వచ్చె సంక్రాంతి

వర్ధిల్ల భోగాలు
వరలు సంపదలు

ఇంటింటి 'మా లచ్చి'
ఇలవేల్పుటమ్మా
పల్లెల వెలిగించు
బంగారు బొమ్మా

2

పలనాటి శౌర్యాలు
పల్లవించంగా
'బలిరాజు' కీరితి
పరిమళించంగా

వచ్చింది సంక్రాంతి

3

చెక్కిళ్ళపై మంచు
ముత్యాలు రాల
చెంగావి పూబంతి
చెండ్లుపై వ్రాల

కాంతి వచ్చిందిలకు
కాంతి వచ్చింది
కామితార్థాల - సం
క్రాంతి వచ్చింది.

4

అందాల పల్లెతల
అటుకుల విందుతో
కలవారి క్షీరాన్న
కలిత హారాల

వచ్చింది సంక్రాంతి

5

పున్నాగి పువులేసి
కవిరాజు నిద్ర
భోగొట్టి కవ్వించి
పొంగళ్ళ పాట

వచ్చింది సంక్రాంతి

రైతుల గేములా
రంగవల్లికలు :
కదలీను ఉలికొక్క
గిలిగింత పెట్టి—

వచ్చింది సంక్రాంతి

పూబోండ్ల సంతోష
పూర్ణ హాసాలతో
భోగి మంటల క
ర్పూరాలు వెలుగ

వచ్చింది సంక్రాంతి

6

క్రొత్తగా పెళ్ళయిన
కోడళ్ళ మనసు
కోరికల మల్లియలు
కొలిచి పోయంగ

వచ్చింది సంక్రాంతి.